# ఆనకట్ట

## బొల్లిముంత నాగేశ్వర రావు

**అప్పారావు నడుస్తున్నాడు- ఇరవై సంవత్సరాల నుండి అప్పటికీ, ఇప్పటికీ ఒకే మాదిరిగా!**

**ఇరవై సంవత్సరాల కిందటే అప్పారావుకు ఉద్యోగం వచ్చింది. అప్పటి నుండీ అతని నడకలో మార్పు వచ్చింది.**

ఉద్యోగం రాకముందు అప్పారావు ఇంకో రకంగా నడిచాడు.

నడక రెండు రకాలు.

ఒకటి పరాధీనమూ, రెండోది స్వాధీనమూ.

పరాధీనమైన నడకలో అప్పారావు పాతికేళ్ళు గడిపాడు! తండ్రి నడవ మన్నట్టు నడిచాడు. పరిస్థితులు పదమన్నట్టు నడిచాడు. బ్రతుకు భరోసాను వెదుక్కుంటూ నడిచాడు.

ఆ నడకలో అప్పారావుకు కాళ్ళు సొంతమయినా కదలికలు సొంతం కాదు. ఏమిటో నిలబడినా నిలబడినట్టు అనిపించేది కాదు. తను ఎక్కడికి పోతున్నాడో గమ్యం కనిపించేది కాదు. ఎంత వెదికినా తన కోసం స్వాగత గీతం వినిపించేది కాదు.

అప్పట్లో అప్పారావు అయోమయంగా నడిచాడు.

అలా నడవగా నడవగా చివరి కెలాగయితేనేం, అప్పారావుకు ఉద్యోగం వచ్చింది. అప్పారావు తండ్రి రమణయ్యగారు ఏదో కొంత కూడబెట్టి, ఆ కూడబెట్టిన దానితో కొడుక్కు ఉద్యోగం ఇప్పించి చేతులు దులుపుకున్నాడు.

ఉద్యోగం రావటంతో అప్పారావు నడక మారిపోయింది. తన నడక తనకే స్వాధీనమయినట్టు అనుభూతి చెందాడు.

ఉదయం సమయాల్లో అప్పారావు హుషారుగా నడిచాడు. ఆఫీసులో అప్పారావు ఆనందంగా నడిచాడు. సాయం సమయాల్లో అప్పారావు షికారుగా నడిచాడు.

అలా రెండేళ్ళు గడిచిపోయాయి.

రమణయ్యగారు కొడుకును పిలిచి అన్నాడు: "నాయనా, అప్పారావూ! నేనా ముసలివాడినై పోతున్నాను. జీవితం చివరి అంచుకు చేరాను. నిన్ను వివాహ మనే మొదటి అంచులో పెట్టి, నా కళ్ళ ముందే ఆ తంతు ముగించి కళ్ళు మూస్తాను."

అప్పారావు అంగీకరించాడు.

అరుంధతి అనే అమ్మాయిని అప్పారావు కిచ్చి పెళ్ళి చేశారు. అరుంధతి అందంగా-మధురోహల చందంగా ఉంటుంది. మనిషి బొద్దుగా-అప్పారావుకు ముద్దుగా ఉంటుంది.

'అందమె ఆనందం' అనుకుంటూ అప్పారావు పాడుకున్నాడు.

రెండు కాళ్ళకు తోడు నాలుగు కాళ్ళయ్యాయి. నడకలో కాస్త వేగం తగ్గింది. ప్రణయానుభూతుల్లో పాదాలు బరువుగా మారాయి.

అప్పారావుకు ఆకాశం అనురాగంగా కనిపించింది. ఆనందం అర్ణవంగా కనిపించింది. ప్రతి రాగమూ కోయిల స్వరంలా వినిపించింది. ప్రతి ఋతువూ ఆమనిలా అనిపించింది!

అప్పారావు ఊహల్లో తేలిపోయాడు. అనుభూతుల్లో సోలిపోయాడు. ప్రేమ మైకంలో తూలిపోయాడు.

రెండు సంవత్సరాలు గడిచాయి.

అప్పారావుకు ఆడపిల్ల పుట్టింది!

×× ×× ××

"ఏమండీ!" అరుంధతి ఒక రోజు అప్పారావుతో అంది.

"ఏమిటి?" అప్పారావు అరుంధతితో అన్నాడు.

"ముందుగా అమ్మాయి పుట్టింది గదా. ఆడపిల్ల పెళ్ళి చెయ్యటమంటే అర్థబలం కావాలి గదా. మీరు చూస్తుంటే అదేం పట్టించుకుంటున్నట్టు లేదు. నెల కింతని తీసి ఎక్కడైనా వేసి అమ్మాయి పేరున ఉంచగూడదూ?"

అప్పారావు పకపక మన్నాడు.

"పిచ్చి అరుం! మొన్న మన నాయకులంతా ఏం చెప్పారు? సోషలిజం వచ్చేస్తుం దన్నారు. సోషలిజమంటే అర్థం తెలుసా?"

తెలీదన్నట్టు అరుంధతి తల అటూ ఇటూ ఊపింది.

"సామ్యవాదం. అది మన దేశానికి రావటానికి అట్టే కాలం పట్టదు. అప్పుడేం జరుగుతుందో తెలుసా? ఈ లోకంలో ఆకలి ఇక ఎక్కడా ఉండదు. మేడా, గుడిసెల నీడా ఒకటిగా మారతాయి. కాలినడకల్లో పయనించేవాళ్ళు కూడా ఇక కార్లలోనే తిరుగుతారు. గంజీ గట్రా తాగేవాళ్ళుకూడా నాయకులు హామీ ఇచ్చిన సోషలిజం రాజ్యంలో మస్తుగా తిని మైమరచిపోతారు. ఇటు అమ్మాయి పుట్టడం, అటు సోషలిజాన్ని ప్రణాళికల్లో పెట్టడం ఒకేసారి జరిగింది. నిజంగా మన అమ్మాయి ఎంతో అదృష్టవంతురాలు. అందుకని దీనికి ముద్దుగా ఒక పేరు పెడుతున్నాను. 'సామ్య'! అంటే సామ్యవాదంలోని మొదటి రెండక్షరాలు. సామ్యవాదమే దీనికి వివాహం చేస్తుంది. సమస్యల్ని పరిష్కరిస్తుంది! భయపడకు. నిశ్చింతగా ఉండు" అన్నాడు.


అరుంధతికి అర్థం కాలేదు. అయినా, అమాయకంగా తల ఊపింది.

అప్పారావు దో పాలసీ.

"జీవితం అనుభవించటానికే."

అప్పారావు చూడని సినిమాలేదు. 'అమెరికా బై నైట్' దగ్గరనుండి 'అర్ధరాత్రి సత్రంలో' వరకు వచ్చిన సినిమాలు వదలకుండా ఒకటికి పది సార్లు చూసేవాడు. ఆదివారం వస్తే బారు షాపుల్లోకి పోయి బీరు, విస్కీ తాగి కాస్త బారుగా తయారై బయటికి వచ్చి, మత్తుగా అనుభవించటం చేతకాక హడావుడిగా తిరిగే జనాన్ని చూసి అనేకసార్లు నవ్వాడు.

### -బొల్లిముంత నాగేశ్వరరావు



1944లో తెనాలి తాలూకా కాకర్లమూడి గ్రామంలో జననం. ప్రస్తుతం అదే తాలూకా, కుచ్చెళ్ళపాడు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పిల్లలకు పాఠాలు చెప్తూ, జీవితంలో పాఠాలు నేర్చుకుంటూ చుట్టూ ఉన్న సమాజాన్ని విశ్లేషిస్తూ రచనలు చేయటం-

ఆంధ్రా యూనివర్శిటీ వారిచే ఆర్ట్ డిగ్రీ, బి.ఎడ్., డిగ్రీ స్వీకరణ.


1969 నుండీ రచనా వ్యాసంగం మొదలుపెట్టి విశాలాంధ్ర నుండి సృజన వరకూ, ప్రజా సాహితి నుండి ఆంధ్రప్రభవరకూ అనేక పత్రికల్లో అన్ని సాహితీ ప్రక్రియల్లో కథలుగా, గేయాలుగా, నాటికలుగా ప్రచురించబడిన అనుభవం.

కొన్ని నాటికలు, నాటకమూ, ఒక నవలా వెలుగును చూశాయి.

1984లో ఆంధ్ర మహిళా సమాఖ్య వారి అందరూ మహిళలే ఉండే నాటికల రచనల పోటీలో 'జాగృతి'కి మొదటి బహుమతి. అలాగే కాకినాడ యంగ్‌మెన్స్ హాకీ క్లబ్ వారి నాటక రచనల పోటీలో 'తెర' నాటకానికి ద్వితీయ బహుమతి. నాటిక రచనలో ప్రోత్సాహాన్నిచ్చాయి.

సామాజిక ప్రయోజనం గల సృజనాత్మక రచనలు చేయటంలో ఆసక్తి.

**పొదుపు కథల పోటీలో ప్రత్యేక బహుమతి పొందిన కథ!**



ఖరీదైన సిగరెట్లు తాగేవాడు. అరగంట కో సిగరెట్ చొప్పున అధమ పక్షం రెండు పెట్టెలు అయ్యాయి!

విస్కీ సిప్.... సిగరెట్ పఫ్...

అప్పారావు ఆనందానికి అవధు లుండేవి కాదు. అసలు అవధుల్లో అప్పారావు జీవించేవాడు కాదు.

×× ×× ××

రెండేళ్ళు గడిచాయి. అరుంధతికి మరలా ఆడపిల్ల పుట్టింది. సోషలిజం నాయకుల చేతల్లో ఉందో, అప్పారావు ఆదివారాలు తీసే బీరు సీసామూ తల్లో ఉందో, తన పెద్దపిల్ల తలరాతల్లో ఉందో అరుంధతి కైతే అర్థం కాలేదు. రెండో ఆడపిల్ల పుట్టినప్పుడు మరలా గాబరా పడింది.

భర్త అప్పారావును పిలిచి బతిమలాడింది.

"ఏమండీ!"

"ఏమిటి?"

"రెండోసారికూడా మనకు అమ్మాయే."

"అయితే ఏం? పిచ్చి ముఖం...అంత భయపడతావేం?"

"ఇప్పటికైనా మీరు మిమ్మల్ని అదుపులో పెట్టుకుని, అమ్మాయిల కేమయినా పొదుపు చెయ్యండి."

"పిచ్చి అరుం! నారు పోసిన వాడే నీరు పోస్తాడు."

"నారు పోసింది మనమండీ! నీరుకూడా మనమే పొయ్యాలి. నీరు బయటనుండి ఎందుకు వస్తుందండీ!"

"అదే నీకు అర్థంకాని విషయమూ, నాకు అర్థమయిన విషయమూ నూ. మొన్న మంత్రిగారేం చెప్పారో తెలుసా? వరకట్న నిషేధం బిల్లు వచ్చేస్తుం దన్నాడు. అంటే ఏమిటో తెలుసా?

కట్నం తీసుకున్న వాళ్ళని కటకటాల్లో తోయిస్తాడు. అమ్మాయిలు ఎదిగి వచ్చేసరికి ఆ చట్టం అమల్లో ఉంటుంది. నీవు అనవసరంగా గాబరా పడకు. కట్నం అడగటమంటే కటకటాల్ని అడగటమే. అంత పనికిమాలిన వెధవ ఎవడూ ముందు కాలాల్లో ఉండడు. అందుకే ఈ శుభ సమయంలో మన రెండో అమ్మాయి కో పేరు పెడుతున్నాను. వరకట్న నిషేధం చట్టమప్పుడు పుట్టింది కాబట్టి గుర్తుగా 'వరం' అని నామకరణం చేస్తున్నాను. ఎందుకంటే, అమ్మాయి లందరికీ ఆ చట్టం వరం లాంటిది."

అప్పారావు నవ్వాడు.

అరుంధతికి అర్థం కాలేదు. అయినా, అయోమయంగా తలూపింది.

తన బతుకు పాలిసీకి ఎక్కడా అవరోధం రాకుండా అప్పారావు ఆనందంగా గడుపుతూ ఆశగా జీవిస్తున్నాడు.

మరో రెండేళ్ళు గడిచాయి.

అభివృద్ధి కార్యక్రమాలు ప్రణాళికల్లోకి, నాయకులు ఎన్నికలలోకి వెళ్ళిపోయారు.

ఎన్ని కలలో అప్పారావు రోజూ కనేవాడు!

ఎన్నికల గోల మాత్రం ఈ దేశంలో అయిదేళ్ళ కో సారే వినేవాడు. ఎన్నికలల్లో వెనకటి వారు కొందరు ఓడిపోయేవారు. రేపటి వాళ్ళు కొందరు గెలిచేవారు.

మరలా ప్రణాళికలు మొదలయ్యేవి.

అప్పారావుకు జీతం పెరిగింది. మార్కెట్టులో ధరల పట్టిక తిరిగేది. బీరు ఖరీదు కాస్త బారుగా అయ్యేది.

అరుంధతికి మాత్రం పరిస్థితులు మారుతున్నట్టు కనపడేవి కావు. సారా దుకాణాల పని నజావుగానే సాగుతుండేది. ఆకలి ఆత్మహత్యలు అక్కడక్కడ వినపడుతూనే ఉండేవి. నిరుద్యోగులు నిరాశతో సమ్మెలూ, సత్యాగ్రహాలూ చేస్తూనే ఉండేవారు. కొత్తగా గెలిచిన ప్రభుత్వం పాత పరిపాలకుల్ని తిడుతూనే ఉండేది.

కట్నాలు తేలేని కోడళ్ళను అత్తలు కిరోసిన్ పోసి చంపుతూనే ఉన్నారు. కోర్టులు అడపాదడపా వారికి శిక్షలు వేస్తూనే ఉన్నాయి.

అప్పారావు సిగరెట్లు తాగుతూనే ఉన్నాడు. బ్లూ సినిమాలకీ, బీరు షాపులకీ వెళ్తూనే ఉన్నాడు.

ఈలోగా అప్పారావు మూ డో ఆడపిల్లకు తండ్రి అయ్యాడు. అరుంధతి అప్పుడు కన్నీరు మున్నీరుగా ఏడ్చింది.

అప్పారావు ఓదార్చాడు.

"ఎందుకే, పిచ్చిముఖం, ఏడుస్తావ్? ఆడపిల్లలు పుడితే ఏడవటం, మగపిల్లలు పుడితే నవ్వటం వెనుకటి అనాగరిక లక్షణం. ఈ కాలానికి ఎవ్వరైనా ఒకటే. అయినా, నీ అనుమానం కాని... ఇప్పుడేమయింది? మొన్న గెలిచినాయన ఏం చెప్పాడో తెలుసా? అయిదేళ్ళలో రామరాజ్యం తెస్తానన్నాడు. రామరాజ్యమంటే నీకు తెలుసా, అరుంధతీ...! చీకూ చింతా లేని రాజ్యం. ప్రజలంతా సుఖించిన రాజ్యం. ధర్మం నాలుగు పాదాల మీద నడిచిన రాజ్యం. భగవంతుడే భూలోకానికొచ్చి పాలించిన రాజ్యం. అలాంటి రాజ్యమే వస్తే మనకు దిగులేముంటుంది, అరుం? ఆడపిల్లా, మగపిల్లవాడూ అనే తేడా ఉండదు.కట్నాలూ కానుక లనేవి ఉండవు. మన పిల్లలు ఎదిగి వచ్చేసరికి అంతా చక్కబడుతుంది."

"ఏం చక్కబడుతుందండీ! పెద్దది పుట్టినప్పుడు అదేదో సోషలిజం వస్తుందన్నారు. రెండోది పుట్టినప్పుడు కట్నాలు లేని చట్టం వస్తుందన్నారు. ఇప్పుడు మూ డోది పుట్టినప్పుడు రామరాజ్యం వస్తుందంటున్నారు. ఎక్కడి కక్కడ చెప్పటమే కాని, ఒక్క పైసా వాళ్ళ పేరున వేసిన పుణ్యానికి పోకపోతిరి." అరుంధతి మరలా ఏడ్చింది.

అప్పారావు చిన్నగా నవ్వాడు. అతడు మనసులో అనుకున్నాడు- 'పిచ్చి అరుం...దేశ పరిస్థితులు తెలీవు. రేపు నిజంగా రామరాజ్యమే వస్తే అనుభవించకుండా పొదుపు చేసిందంతా అర్థం లేని దవుతుంది. అందుకే ఆడవాళ్ళకు ముందు చూపు తక్కువంటారు.'

భార్యను ఓదార్చి అప్పారావు భాగ్య థియేటంకు నడిచాడు- అక్కడ 'లండన్ రాత్రి కన్యలు' పన్నెండో సారి చూడటానికి!

## 2

సంవత్సరాలు గడిచాయి. అప్పారావు సృష్టించిన ముగ్గు రాడపిల్లలూ పెరిగి పెద్దవాళ్ళయరు.

రామరాజ్యం వస్తుందని రేయింబవళ్ళు ఎదురుచూశాడు. తెస్తానన్న మంత్రిగారు తేలేదు. ఎన్నికలు రాగానే ఓడిపోయి వెళ్ళిపోయాడు. ఎదిగిన పిల్లల్ని ముందెట్టు కున్న అప్పారావుకు అంతా అగమ్యంగా మారింది.

ఆ సాయంత్రం అప్పారావు అలా నడిచి వెళ్తున్నాడు. రోడ్డుకు పక్కనే ఏదో సినిమా.

ఏదో ప్రచార విభాగం వారి తాలూకు డాక్యుమెంటరీ.

అప్పారావు అలాగే నిలుచుండిపోయాడు. అతనికి తెరమీద బొమ్మలు, వెనుగ్గా వ్యాఖ్య వినిపిస్తోంది.

"జీవితం నది లాంటిది. కొండ తల్లి లాంటిది. ఆకాశం తండ్రి లాంటివాడు! ఆకాశం వర్షించిన ప్రేమధారల్లో నడుపుతుంది. అక్కడనుండి ప్రయణం. ఎత్తునుండి పల్లానికి దిగుతున్న కొద్దీ వేగం. ఉరుకులు పరుగులుగా...ఎదురు దెబ్బ లేం తగిలినా లెక్క ఉండదు!

మనిషి బాల్యమూ అంతే. ఉరుము ఉరిమినా, ఆకాశంలో హరివిల్లు విరిసినా అంతా నా కోసమే అనుకుంటాడు. స్వచ్ఛంగా ఏ కల్మషమూ ఎరుగని నల్ల రాళ్ళమీది నీరులా ఆ వయసులో




నా ప్రాణము ఎక్కడుంది
నాకు నేనుగా
వేసుకుంటున్న ప్రశ్న
ప్రతి ఒక్కరు
ఎవరికి వారే
వేసుకోవలసిన ప్రశ్న
ముందుగా ప్రశ్న
నేను వేసుకుంటున్నాను
జవాబుకోసము
అందరిని ఆలోచించమంటున్నాను
మనమంతా మనుష్యులం
మంత్రముగ్ధులం
యంత్ర బద్ధులం
అనంతకోటి
జీవరాసుల పాలిటి
నియంతలం
ప్రాణికోటిని
శాసించేవాళ్ళం
మన ప్రాణ మెక్కడుందో
తెలుసుకుందాం
ఆచూకి తెలిస్తే
జాగ్రత్తగా మసలుకుందాం
మైరావణుడు ప్రాణాన్ని
తుమ్మెదలో దాచుకున్నాడంటే
అవునేమో? అనుకునేవాణ్ణి
మాయల ఫకీరు ప్రాణము
చిలుకలో ఉందంటే
తికమక పడని వాణ్ణి
కోతి గుండెకాయ
మేడి చెట్టుమీద ఉందంటే
మొసలిలాగ నమ్మి
మోసపోయేవాణ్ణి
ప్రాణముకోసము
ఆలోచించే
తీరిక లేని వాణ్ణి
తీరిక చేసుకొని
ప్రాణము గురించి
ఆలోచిస్తే
నా ప్రాణము నాలో లేదు
ఎక్కడుంది నా ప్రాణము?
ప్రశ్న వేసుకున్నాను
సమాధానము దొరికింది
బ్యాలెట్‌లో...
బాంకు నోట్‌లో...
బాయ్‌నెట్‌లో...
నా ప్రాణము
గిజగిజ తన్నుకుంటుంది
కాపాడమని వేడుకుంటుంది

(1985లో వికాస గ్రంథ మండలి, తెనాలి వారిచే నిర్వహించబడిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి "శ్రీశ్రీ-చెరబండ రాజు"ల స్మారక కవితా పోటీలో ద్వితీయ బహుమతి పొందిన కవిత)

ఆహ్లాదంగా ఉంటాడు. రాయిమీది నుండి రాయి మీదికి దూకుతూ లయబద్ధంగా వినిపించే నదీ సంగీతం అతనిలో వినిపిస్తుంది. ఆ ఉత్సాహాన్ని ఎవ్వరూ ఆపలేరు. ఈలలు వేస్తూ ఎగురుతూ పోయే వయసు. తండ్రి సందిటా, తల్లి కౌగిట —ఎక్కడ చూస్తే అక్కడ వీళ్ళే.

కోయిల సంగీతంతో వసంతకాలమూ, మంచు గడ్డల్ని కరిగిస్తూ గ్రీష్మమూ, చలిదుప్పట్లను తీసుకుని శిశిరమూ అన్నీ ఇతని కోసమే దాగుడుమూతలాడతాయి!

అలా కొంత కాలం గడిచిపోతుంది.

నది కొంత దూరం నడిచిపోతుంది. ఎత్తైన పర్వత శిఖరాలనుండి తను ప్రవేశించబోయే విశాలమైన మైదానాల్ని చూస్తుంది!

బాల్యంలో, యవ్వనంలో మనిషీ అంతే. ఎత్తైన విద్యాపీఠాల్ని అధిరోహిస్తాడు. అక్కడనుండే విశాల విశ్వంలోని విజ్ఞాన క్షేత్రాల్ని తన మూడో కంటితో చూస్తాడు.

నది మైదానం లోకి ప్రవేశిస్తుంది.

మనిషి జీవితంలోకి ప్రవేశిస్తాడు.

ఇక్కడ పయనం నెమ్మదిగా, గంభీరంగా సాగిపోతుంటుంది. చేదుగా, తీపిగా ఉండే చెట్ల సారం ఎంతో నదిలో కలిసిపోతుంది. చేదు, తీపి జీవితానుభవాలు కూడా ఇక్కడే మనిషికి మొదలవుతయి!

మైదానం మీద అంచుల్ని ఒరుసుకుంటూ నది ముందుకు కదులుతుంది!

ఆర్థిక పునాదుల మీద వైవాహిక బంధాల మధ్యగా మనిషి జీవన స్రవంతి ముందుకు సాగిపోతుంది.

ఇక అసలు విషయాని కొస్తే నదికి ఇక్కడే ఆనకట్టలు కట్టాలి. ప్రవహిస్తున్న జీవధారల్ని ప్రయోజనాత్మకతవైపుకి మళ్ళించాలి. బతుకుల్ని పండించే పచ్చ తోరణాల పవిత్ర క్రతువుల్ని ప్రతి ముంగిటా జరిపించాలి. 'సుజలాం- సుఫలాం సస్యశ్యామలాం' ప్రతి నోటినుండీ వినిపించాలి. ముందు తరాల మహాభ్యుదయానికి ఈ ఆనకట్టలే ఆలంబనం అనిపించాలి!

మరి మనిషి జీవన స్రవంతికీ ఇక్కడే ఆనకట్టలు పడాలి.

'అదే పొదుపు.'

సంపాదనలో మిగిలినదాన్ని సద్వినియోగం దిశగా మళ్ళించాలి. పెరుగుతున్న తన చిన్నారి పొన్నారి ప్రతిరూపాలకు వారి ముందు కాలాల మంగళప్రదమైన అభివృద్ధికి ఈ పొదుపు పునాదిగా నిలిచిపోవాలి!

లేకుంటే ఆనకట్ట లేని నది నీరు సముద్రంలో కలిసిపోతుంది! తీయగా ఉండే కమ్మని నీరు ఉప్పుగా మారిపోతుంది. ఎప్పటికీ అది తిరిగి రాదు.

మనిషి సంపాదనా అంతే.

ప్రయోజనం లేకుండా ఖర్చు చేసింది మరలా తిరిగి రాదు.

జీవితం విలువైంది. దానిమీద ఆల్కహాలును గుమ్మరించి, సిగరెట్లతో కాలిస్తే ముందు కాలానికి మోడుగా మారిపోతుంది. నమ్ముకున్న వారికి నీడ లేకుండా పోతుంది.

నదికి ఆనకట్ట లాంటిదే మనిషి జీవనానికి పొదుపు."

ఏదో చెప్పుకుపోతున్నాడు. చెప్పినదానికి తగ్గట్టుగా తెరమీద బొమ్మలు పడుతున్నాయి.

• అప్పారావు అంతరంగం ఆవేదనగా మూలిగింది.

ఒక మోడుబారిన చెట్టు కింద ఎండకూ, వానకూ ఎండుతూ, తడుస్తూ బక్కచిక్కిన ముగ్గురు పిల్లలు దీనంగా, హీనంగా కనిపించారు. నది సముద్రంలో కలిసిపోతున్న చివరి దృశ్యం అది!

'అరుంధతి మొత్తుకుంటున్నా తను ఇప్పటివరకూ ఏమీ పొదుపు చెయ్యలేకపోయాడు.


రేపు నిజంగా తను మోడు బారితే...!

తన నీడను నమ్ముకున్న తన భార్యా, తన పిల్లలూ...'

అప్పారావుకు మొదటిసారిగా ఆవేదన కలిగింది! అక్కడ ఉండలేక పోయాడు!

ఏదో భయం అతన్ని మొత్తంగా ఆవహించింది. మనిషికి చెమట పట్టింది. ముగ్గురాడపిల్లలూ వరసగా అతని కళ్ళ ముందు నిలిచారు.

ఎవరికీ ఒంటిమీద చిన్నమెత్తు బంగారు నగలేదు. మంచి దుస్తుల్లేవు. ఏదో బతకటానికి ఇచ్చిన తిండి వారి శరీర పొందికల్లో పరిపూర్ణతను సంతరించి పెట్టలేకపోయింది. మనుషులు పాలిపోయినట్లు తెల్లగా కనిపిస్తున్నారు.



గులాబిలు తొంగి చూడవలసిన వారి లేత బుగ్గల్లో ఏదో శూన్యం చోటు చేసుకుంది. చలాకీగా ఉండవలసిన వారి శరీరాల్లో ఏదో నీరసం ఆవహించింది! చిరునవ్వులు చిందాల్సిన వారి పెదాల్లో ఏదో చెప్పలేని చింత! వెలుగులా వికసించాల్సిన వారి మనస్సుల్లో ఏదో చీకటి.

'అందుకు కారణం నువ్వే.'

అంతరంగం లోపలనుండి అరిచినట్లు అప్పారావుకే అనుభూతి. జేబురుమాలుతో ముఖం తుడుచుకున్నాడు.

మెల్లిగా ఇంటి ముఖం పట్టాడు!

ఇటీవల దగ్గు తెరలు తెరలుగా వస్తోంది.

చిక్కిపోతున్నావని స్నేహితు లంటున్నారు.

'మీలో ఏదో మార్పు వస్తోం'దని భార్య అంటూంది!

'అమ్మా! ఏమిటే నాన్న అలా అయిపోతున్నా'డని పిల్ల లంటున్నారు. ఆలోచిస్తూ అప్పారావు ఇంటికి చేరాడు.

భార్య కొత్తగా కనిపించిరిది!


'ఎన్నడూ నోరు తెరచి ఓ పట్టుచీరె అడిగి ఎరగదు. యాంత్రికమైన కదలికల్లో ఎన్నో సంవత్సరాలనుండి తన కోసం జీవితాన్ని లాక్కొస్తూంది.

ఆమెకు మాత్రం అభిరుచులూ, అనుభూతులూ ఉండవా?

ఉంటాయి!'

అప్పారావు అంతరంగం అంగీకరించింది!

ఆమె ఆర్థికంగా అస్వతంత్రురాలు! తను జీతంలో మిగిలినవి ఇవి అని ఇస్తే ఇంటి కింద వాడేది. అయిపోయిన వాటిని గురించి అప్పుడప్పుడు మౌనంగా హెచ్చరించేది. ఆడపిల్లల అచ్చటా ముచ్చటా గురించి అడపా దడపా ఏకరువు పెట్టేది! వాటిని తనెప్పుడూ పట్టించుకొనేవాడు కాదు!



ఆమె ఇప్పుడు మౌనంగా ఆందోళన పడుతూంది!

ఎదిగిన పిల్లలూ, తరిగిపోతున్న తన ఆరోగ్యం...అందరు గృహిణుల్లా ఆమె కొన్నింటికి నోచుకోలేదు. అవకాశా లుండి కూడా ఆమె నలా దూరం చేసింది తనే.

ఆ సమయంలో అప్పారావులో ఏదో గట్టి నిర్ణయం జరిగింది. తను రేపే ఆసుపత్రికి పోవాలి. ఆరోగ్యం చక్కదిద్దుకోవాలి. అరుంధతి కోసమూ, పిల్లల కోసమూ ఇకముందు బతకాలి.

మరుదినం అప్పారావు ఆసుపత్రిలో చూపించుకున్నాడు. పరీక్షించిన డాక్టర్లు ఊపిరితిత్తుల్లో కాన్సరు ముదిరిం దన్నారు.

అప్పారావు నెత్తిమీద పిడుగు పడ్డట్టుగా ఆవేదన చెందాడు. అతని లోపల ఏదో ఆత్మ ఉన్నట్టూ, అది బయటకి వచ్చి అరవటం మొదలు పెట్టినట్టూ అనుభూతి చెందాడు!

'ఇడియట్! ఇప్పు డెలా? ! నన్ను ఆల్కహాలుతో అభిషేకించి సిగరెట్ల ధూపం వేశావు. చూడిప్పు డెలా అయ్యానో? చిక్కి శల్యమయ్యాను. వేల రూపాయలు ఖర్చు పెట్టి తెచ్చుకున్న జబ్బు. అయినవారి కో పైసా మిగల్చాలనే ఆలోచనకూడా లేకుండా తెచ్చుకున్న జబ్బు-ఎలా నయమవుతుంది?

శిశువుకు దక్కని స్తన్యంలాగా ప్రవహించావు. ఇప్పు డేడిస్తే ఏం లాభం?

అర్ధాంగి అడిగినప్పుడల్లా అర్థంలేని కబుర్లు చెప్పావు! ఆమె అసహాయతతో ఆడుకున్నావు!

అవునూ...అప్పారావ్! సామ్యవాదం పొదుపు చేసుకో వద్దంటుందా? రామరాజ్యం పొదుపు చేసుకో వద్దంటుందా? అనారోగ్యకరమైన అలవాట్లతో ఆర్థిక దుబారా చెయ్యమని ఏ సిద్ధాంతమూ చెప్పదు! నీ వెకిలి అవసరం కొద్దీ నువ్వు చెప్పావు!'

ఆత్మ అరుస్తున్న కొద్దీ అప్పారావు కుంచించుకుపోయాడు! కుంచించుకు పోతూకూడా అప్పారావు ఆలోచించాడు!

'నడక ఎప్పుడూ స్వతంత్రం కాదు. దానికి స్వేచ్ఛ లేదు. నడకలోకూడా నియమాలున్నాయి. రోడ్డుకు పక్కగా మాత్రమే నడవాలి. హద్దు లేకుండా ఎలా అయినా నడవచ్చుని మధ్యగా నడిస్తే అపాయాలు మీదగా దొర్లిపోతాయి. బతుకు బజారులో నెత్తురు కక్కుతుంది.

తన సంపాదనలో సగానికి పైగా కలవారి బారు షాపుల్లో ఖర్చయింది. పరిశ్రమలు నడిపే పెద్ద వారి 'పొగపెట్టె' లకు ఖర్చయింది. ధనవంతులైన నిర్మాతల వెకిలి భావాల 'ఎ' సర్టిఫికేట్ సినిమాలకు ఖర్చయింది. చెందవలసిన తన చిన్నారులకు చెందకుండా పోయింది. రూపాయకి రెండు రూపాయలు జత చేసి ఇచ్చే జాతీయ జీవన సంక్షేమ ప్రస్థానంలో కనీస పాత్రనుకూడా తను పంచుకోలేకపోవటం జరిగింది. అంతా చేజారి పోయింది! ఆత్మీయుల కన్యాయం జరిగింది!'

అప్పారావు ఆలోచన సాగిపోతూంది.

ఆనకట్ట లేని నదిని అక్కడ కడలి మింగింది! తీయగా మైదానాల్లో ప్రవహించవలసిన నీరు ఉప్పగా మారిపోయింది!

అప్పారావు ఇక్కడ చప్పబడి పోయాడు!

SANKAR